
## భలే పని

# భలేపని

తెలుగు అనువాదం : కె. సదాశివరావు
జపనీస్: కెంజాబురో ఓయె
ఆంగ్లం: లారెన్స్ రోజర్స్

యూనివర్సిటీ హాస్పిటల్ ముందున్న విశాలమైన పేవ్‌మెంట్ ప్రక్కనుండి గంటస్తంభం వేపు నీవు నడుస్తుంటే నాలుగు బాటలు కలిసేచోట మొరుగుతున్న కుక్కల గోల నిన్ను అహ్వానిస్తుంది. అకస్మాత్తుగా ఆ దారిన పోయేవారికి కడుతున్న భవనపు ఇనుప చువ్వలు మందంగా, పదునుగా ఆకాశం వేపుకి లేస్తూ కనిపిస్తాయి. వీధికి రెండు వేపులా పెరిగిన చిన్నచెట్ల తలల మీద నుండి వీచే గాలుల దిశ మారినప్పుడు కుక్కల మొరుగుడు గోలగోలగా ఆకాశం దిశగా ఎంతో దూరం వరకు పోతూ, వదలకుండా మారుమ్రోగుతూ భయంకరంగా తారస్థాయికి చేరుతుంది.



ప్రతిసారీ ఆ కూడలికి వచ్చినప్పుడు నేను పేవ్‌మెంట్ మీద వొంగినడుస్తూ, క్లాసులకి వెళుతూ వస్తున్నప్పుడు ఆ మొరుగుడు శబ్దాన్ని నేను జాగ్రత్తగా వినేవాణ్ణి. నిజానికి నా హృదయాంతరాళాల్లో నేను ఎందువల్లనో ఆ కుక్కల శబ్దాల కోసం ఎదురు చూసే వాణ్ణి. కాని వొకోసారి నాకు ఏ శబ్దాలూ వినిపించేవికావు. అలాగని వినపడీవినపడని కుక్కల మొరుగుళ్ళ కోసం నేనేదో ప్రత్యేకమైన ఆదుర్దా ఫీలయ్యాననటం. నా ఉద్దేశంకాదు.

మార్చినెల చివరన కాంపస్ బులెటిన్ బోర్డ్ మీద పార్ట్ టైమ్ స్టూడెంట్ వర్కర్స్ కోసం ఉద్యోగాల నోటీస్ నేను చూశాక కుక్కల మొరుగుడు శబ్దం నా జీవితంలో అంతర్భాగమైపోయి నన్ను వదలని ఓ చల్లటి తడిగుడ్డలా తగులుకుంది.

హాస్పిటల్ రిసెప్షన్‌లో వాకబు చేస్తే పార్ట్ టైమ్ జాబ్స్‌గురించి వాళ్లకేం తెలియదు పొమ్మన్నారు. పట్టుదలతో నేనే ఓ సెక్యూరిటీ గార్డ్‌ని అడిగితే నన్ను హాస్పిటల్ వెనకవేపుకు వెళ్ళమన్నాడు. అక్కడ చెక్కతో చేసిన స్టోర్ రూములున్నాయి. ఓ రూమ్ ముందు ఆడపిల్లల కాలేజీలో చదువుకుంటున్న ఓ అమ్మాయి, ప్రైవేట్ కాలేజి లో చదువుతున్న ఓ అబ్బాయి నిలబడి, నడివయస్సులో పాలిపోయిన రంగుతో వుండి బూట్లు వేసుకుని వున్న వ్యక్తి ఉద్యోగం గురించి చెబుతుంటే వింటున్నారు. నేను వెళ్ళి మగ విద్యార్థి వెనక



వింటూ నిలబడ్డాను. చెబుతున్న మనిషి బరువైన తన కనురెప్పల కిందనుండి నన్ను తేరిపారజూసి, కాస్త తల పంకించి తను చెప్పినదే మళ్ళీ చెప్పడం మొదలు పెట్టాడు.

"మనం ఓ నూట ఏభై కుక్కల వరకూ చంపవలసి వుంటుంది. ప్రత్యేకంగా కుక్కల్ని చంపటానికి నియమించిన మనిషి ఆ వెనక

ఈ సంవత్సరపు నోబెల్ పురస్కారగ్రహీత జపనీస్ కథారచయిత, నవలాకారుడూ, విమర్శకుడూ కెంజాబురో ఓయె రాసిన మొట్టమొదటి కథ ఇది. అతడు ఈ కథని 1957లో రాయగా అది ఓ కాలేజి మాగజైనులో ప్రచురిస్తే దానికి ఆ సంవత్సరపు కాలేజి మే ఫెస్టివల్ అవార్డు లభించింది. దీనికి పెట్టిన పేరు "ది ఆడ్ జాబ్' లేక "ఎ క్యూరియస్ కైండ్ ఆఫ్ జాబ్"

ఈ కథలో అన్యదేశీయుల ఆక్రమణలో వున్న జపాన్ దేశపు దీనావస్థ ప్రతిఫలిస్తుంది. రెండవ ప్రపంచయుద్ధానంతరం, హిరోషిమా, నాగసాకీ నగరాల మీద ఆటంబాంబ్‌లు వేసిన తర్వాత జపాన్ దేశం ఓటమిని అంగీకరించాక అమెరికన్స్ ఆ దేశాన్ని కొన్ని నెలలు ఆక్రమించుకున్నారు. ఇది జపనీస్ ఆత్మాభిమానానికి పెద్ద దెబ్బ. ఈ కథలోని ప్రతిధ్వనులు జపనీయుల హృదయంలోని బాధ ప్రకంపనాలకి ప్రతీకలు. ఎవరు మనుషులు? ఎవరు కుక్కలు?

ప్రపంచ యుద్ధంలో ఓడిపోయిన వారే ప్రస్తుతం జరుగుతున్న అంతర్జాతీయ వాణిజ్య మహాసంగ్రామంలో తిరుగు లేని విజేతలుగా కొనసాగుతున్నారు. And How!!

ఫున అన్నీ సిద్ధం చేస్తున్నాడు. మీరు పని-
ఫు మొదలుపెట్టి ఓ మూడు రోజుల్లో పూర్తి
యాలి".

ఓ ఆంగ్ల వనిత స్థానిక వార్తా పత్రికలో
డిటర్‌కి ఓ ఉత్తరం రాసిందట. ఆ హాస్పిటల్
' మెడికల్ పరిశోధన కోసం తెచ్చి వుంచిన
క్కలని చాలా క్రూరంగా చూస్తున్నారనీ.
'టినన్నింటినీ విడుదల చేసి జాగ్రత్తగా
ాడటానికి కావలసిన డబ్బు లేకపోవడంచేత
వాటినన్నింటినీ చంపివేయాలని నిర్ణయం తీసుకున్నారట. ఈ కుక్కల మంద బెడదని వదిలించుకునే బాధ్యతని ఈ పెద్ద మనిషికి ఇవ్వడం జరిగింది.

"మీరందరూ డిసెక్షన్... ఇంకా కుక్కల గురించి ఎన్నో విషయాలు నేర్చుకుంటారు."

మేము పనిచేయవలసిన వేళలూ, ఎలాంటి దుస్తులు వేసుకురావాలో చెప్పి అతడు హాస్పిటల్ లోపలికి వెళ్ళిపోయాక మేము ముగ్గురం కలిసి యూనివర్శిటీ వెనక వున్న గేటు వేపుకి నడిచి వెళ్ళాము.

"జీతం మాత్రం చాలా బావుంది కదూ?" అంది అమ్మాయి.

ప్రైవేట్ కాలేజి విద్యార్థి ఆశ్చర్యపోయాడు.

"నీవు ఆ జాబ్ తీసుకుంటున్నావా?"

"అవును నేను చదువుతున్నది బయాలజీ. నాకు జంతువుల కళేబరాలు అలవాటే"

అలా అయితే తానూ ఆ జాబ్



తీసుకుంటానన్నాడు స్టూడెంట్ కుర్రాడు.

నేను రోడ్ల కూడలి దగ్గర ఆగి కుక్కల అరుపుల కోసం ఎదురుచూశాను. కానీ ఏమీ వినిపించలేదు. వీధిలోని ఆకులు లేని చెట్లలోంచి సంధ్యాపవనం ఈలలు వేస్తూ వీచింది. నేను పరుగెత్తుకెళ్ళి ఆ ఇద్దరు విద్యార్థులను చేరుకున్నాను. ప్రైవేట్ కాలేజీ విద్యార్థి నాకేసి ప్రశ్నార్థకంగా చూశాడు.


"నేను ఆ పనిలో చేరతాను" అన్నాను.

మరునాడు ఉదయం లేత ఆకుపచ్చరంగు పాంట్ వేసుకుని నేను పనిలోకి వెళ్లాను. కుక్కల్ని చంపేవాడికి ముప్ఫై ఏళ్ళ వయసుంటుంది. పొట్టిగా వున్నప్పటికీ చాలా బలిష్టంగా వున్నాడు. నేను ఓ కుక్కని తీసుకుని స్టోర్ రూముకి ముందున్న చిన్న దొడ్డిలోనికి తీసుకెళ్లగానే కుక్కల్ని చంపేవాడు చంపిన వెంటనే ప్రైవేట్ కాలేజి విద్యార్థి తోలు తీసిన కళేబరాన్ని తీసికెళ్ళి వేరేమనిషికి అప్పగించేవాడు. అమ్మాయి తోళ్ళ సంగతి చూసుకునేది. పని సునాయాసంగా జరిగిపోతున్నది. ఆ ఉదయం మేము ఓ పదిహేను కుక్కల్ని వదిలించుకున్నాము. తొందరగానే నాకు ఆ పని చేయటం అలవాటై పోయింధి.

కుక్కల్ని వుంచిన స్థలం చుట్టూ ఓ పొట్టి కాంక్రీట్ గోడవున్న ఆరుబయలు ప్రదేశం వుంది. అక్కడ వరసల్లో కొయ్యగుంజలు పాతి వున్నాయి. గుంజకీ గుంజకీ మధ్య ఓ మీటర్ దూరం వుంది. ఒకో గుంజకి ఒక కుక్క కట్టేసి వుంది. కుక్కలు మాత్రం ఏ గొడవా చేయకుండా బుద్ధిగా వున్నాయి. వాటిని అక్కడ ఓ సంవత్సరం నుండీ వుంచారట. ఆ కాలంలో వాటిలో సహజంగా వుండే పొగరు, చురుకుదనం అవి పూర్తిగా పోగొట్టుకున్నాయి. నేను కాంపౌండ్‌లోకి వెళ్ళినప్పుడు నన్ను చూచి అవి మొరగలేదు. హాస్పిటల్‌లో పనిచేస్తున్న ఓ గుమస్తా చెప్పిన దానిని బట్టి ... కుక్కలు సాధారణంగా ఏకారణం లేకుండానే మొరగడం మొదలుపెడతాయి....మళ్ళా అవి సద్దుమణగటానికి ఓ రెండుగంటలకాలం పడుతుంది. ఎవరైనా కాంపౌండ్ లోనికి వెళ్ళటం వల్ల అవి అలజడి చెందవు.

నేను లోపలికి వెళ్ళినప్పుడు అవి మొరగలేదు కాని అవన్నీ నాకేసి చూశాయి. నూట యాభై కుక్కలు ఒకే సమయంలో నన్ను చూడటం వలన నాలో ఓ విచిత్రానుభూతి కలిగింది. నా మూడు వందల ప్రతిబింబాలూ జీవరహితంగా వున్న జేగురురంగులో వున్న కుక్క కళ్లలో వున్నట్లు తోచిన ఊహ నా శరీరంలో ఓ తీవ్రమైన జలదరింపు కలిగించింది.

ఆ కుక్కలునిజానికి రకరకాల జాతులవి. దాదాపు వూహించదగినన్ని రకాల జాతుల కలయికలతో వున్నాయి. అంతే కాదు, అవి వొకదానితో మరొకటి పోలివున్నాయి. పెద్ద కుక్కలూ...చిన్న కుక్కలూ... అతి సాధారణమైన మధ్య రకపు సైజువీ... ఎర్రబొచ్చుతో వున్నవీ.. కొయ్యగుంజలకి కట్టేసి వున్నాయి. అయినా మాకు ఆ కుక్కలన్నీ ఒకే రకంలా కనిపించాయి.




అవన్నీ ఒకేలా వుండటం ఎలా సాధ్యమని నేను ఆలోచించాను. అవన్నీ ఆకలితో మాడివుండి, రకరకాల రక్తాలు కలియటం వల్లనా ? లేకపోతే కొయ్యగుంజలకి కట్టివుంచటం వల్ల వాటిలోని దూకుడుతనం చురుకుపాలు పోగొట్టుకోవడం వల్లనా? యస్!... అంతే అయివుంటుంది. బహుశా మేమూ అలాగే తయారవుతామేమో! మేము...జపనీస్ విద్యార్థులం... నాలోని చురుకుదనం పోగొట్టుకుని...సరైన నిర్వచనం లేకుండా... అతి సులభంగా కట్టివేయబడి... అందరమూ ఒకేలా కనిపిస్తూ.... మా వ్యక్తిత్వాలని పోగొట్టుకుని....

అయినా నాకు రాజకీయాల మీద ఏ మాత్రం ఆసక్తి లేదు. ఏదో ఓ ఉద్యమానికో, రాజకీయానికో, మరో సమస్యకో నన్నునేను నమర్పించుకోవటానికి నేను మరీ చిన్నవాడినైనా అయివుండాలి లేదా మరీవయసు మీరిన వాడినైనా అయివుండాలి నాకిప్పుడు ఇరవైఏళ్ళు. అది ఓ విచిత్రమైన వయసు. అంతేకాదు నేను బాగా అలసిపోయిన వాణ్ణి. కుక్కల గుంపు మీద నాకు వున్న ఆసక్తి తొందర్లోనే తగ్గిపోయింది.

నేను ఓ తమాషాగా వున్న కుక్కని చూశాను. అది ఆల్సేషియన్ ... జర్మన్ స్పిట్జ్ జాతి కుక్కల మిక్స్అయివుండాలన్న ఆలోచనతో పాటు నాకు ఓ అసంబద్ధమైన థ్రిల్ వచ్చింది. ఆ కుక్క ఆల్సేషియన్ తలతో వేడిగాలిలో ఎగురుతున్న తెల్లటి బొచ్చుతో వుంది. నేను గట్టిగా నవ్వాను.

"ఇదిగో దీని వేపు చూడండి! ప్రైవేట్ కాలేజీ స్టూడెంట్‌తో అన్నాను.

"స్పిట్జ్ కుక్కమీద ఆల్సేషియన్ ఎక్కినప్పుడు భలేతమాషాగా వుంటుందని నేను పందెం కాస్తాను."

నా కోవర్కర్ చిరాకుగా ముఖంపెట్టి నిరాసక్తంగా అటుతిరిగిపోయాడు. తర్వాత మధ్యసైజులో వున్న ఓ అస్పష్టమైన జాతికుక్కని గొలుసుపెట్టి గోడవెనక నుండి బయటకి లాక్కు వచ్చాను. దొడ్డిలోనికి దాన్ని నేను లాక్కెళ్ళాను. అక్కడ కుక్కలని చంపేవాడు చేతిలో గదలాంటి ఆయుధాన్ని పట్టుకుని సిద్ధంగా వున్నాడు. కన్నుమూసి తెరిచేలోగా ఆ గదని తన వీపు వెనక దాచివుంచి మావేపు వచ్చాడు. నేను గొలుసు పట్టుకుని నాకూ కుక్కకీ మధ్యన కాస్తఎక్కువ ఎడం వుండేలా చూసుకున్నాను. మెరుపులా గద వచ్చింది. చిన్న అరుపు అరిచి కుక్క నేలగూలింది. ఆ చంపటంలోని క్రూరత్వం నోటమాట పెగలనంత భయంకరంగా వుంది. నేను చూస్తుండగానే కుక్కలని చంపేవాడు తన నడుముకి వున్న తోలు బెల్ట్ నుండి తీసిన వెడల్పాటి పదునైన కత్తిని కుక్కగొంతులో గుచ్చి దాని రక్తాన్ని ఓ బకెట్‌లోకి కార్చాడు. తర్వాత అద్భుతమైన నైపుణ్యంతో దాని తోలు వలిచేశాడు. కుక్క తాజా వేడి రక్తం నా సర్వేంద్రియాలకీఓ ప్రత్యేకమైన అనుభూతిని కలిగించింది.


ఆ చర్య ఎంత నికృష్టంగా వుంది?? నాకళ్ళముందేఆక్షణాన ఓ కుక్కని యమపురికి పంపుతున్న అవసరమైనప్పటికీ అతి హేయమైనఆవ్యాపకాన్నీ అంత త్వరితంగా ఆచరణలో పెట్టడంలోని నికృష్టతనీ ఖండించటానికి నాకు సాధ్యం కాలేదు. ఆ

నికృష్టత బహుశా ఉదరపోషణార్థం చేసే అనేక వ్యాపకాల లోతుల్లో నిగూఢంగా శిలా సదృశంగా ఉండివుంటుందేమో? అంత తీవ్రంగా కోపం తెచ్చుకోని వైఖరికి నేను అలవాటు పడిపోయాను. నా అలసట రోజునుండి రోజుకి పాకుతుంది. ఇప్పుడు నాకు కట్టెలు తెంచుకుంటూ కోపం రాదు. కుక్కల హంతకుడి హేయస్థితిని కళ్ళారా చూసినప్పుడు కూడా. ఆ అలసట పూర్తిగా ఓ రూపు తీసుకోదు. అది త్వరలో ఎండిపోయి కాలిపోతుంది. నా మిత్రులతో నేను విద్యార్థి ఉద్యమాలలో పాల్గొనలేకపోయాను. నాకు రాజకీయాల మీద ఆసక్తి లేకపోవటం వాస్తవమే కాని అసలు కారణం ఏమిటంటే నాలోని ఉద్రేకాన్ని ఎక్కువసేపు నిలుపుకోవటం నాకు అసాధ్యమవటం. అప్పుడప్పుడూ నేను ఈ పరిస్థితిని ఎంతో ఆందోళనతో విశ్లేషించి చూస్తాను. కాని నాకు ఎన్నడూ కోపం రానంతగా నేను అలసిపోయాను.

చచ్చిన కుక్క వెనక కాళ్ళని లేపి కలిపి పట్టుకుని తోలు తీశాక మంచులా తెల్లగా కుదురుమట్టంగా బాగా అలిమిగా వున్న దానిని నేను బయటకు ఈడ్చుకెళ్లాను. ఆ జంతువు వెచ్చని వాసనని వెదజల్లింది. దాని కండరాలు హై బోర్డ్ మీద నుండి డైవ్ చేయబోయే మనిషి కండల్లా శక్తిమంతంగా నా చేతుల్లో ముడుచుకుపోయాయి. దొడ్డి బయట ఎదురుచూస్తున్న ప్రైవేట్ కాలేజి కుర్రాడు ఒక శవాన్ని తీసుకెళ్ళాడు.. దాన్ని తన వంటికి ఎక్కడ తగలకుండా జాగ్రత్తపడుతూ. చచ్చిన కుక్క మెడలోని గొలుసు తీసుకొని చేత్తో పట్టుకొని నేను కొత్త కుక్కని తీసుకురావడానికి వెళ్ళాను.

ప్రతి ఐదో కుక్క తరువాత కుక్కల్ని చంపేవాడు పొగపీల్చడానికి దొడ్డిబయటకు వచ్చేవాడు. నేను అతడితో మాట్లాడే వాణ్ణి వాడు నేలమీద చతికిలపడి కూర్చుని ఉంటే వాడి చుట్టూ తిరుగుతూ నేను తిరగటం ఆపినప్పుడు అతడినుంచి వేడైన కుక్కవాసన రావటాన్ని నేను పసిగట్టాను. నిజానికి ఆవాసన కుక్కల వాసన కన్నా రక్తపు వాసనలా వుండడంవల్ల నా ముఖాన్ని కాజువల్‌గా తిప్పేసి అతడి చుట్టూ నడుస్తూ తిరిగాను. అమ్మాయి దొడ్డిలోపల తోళ్ళని జాగ్రత్త చేస్తోంది. కడిగేచోట భయంకరంగా వుంది రక్తసిక్తమైన తోళ్ళని ఆమె జాగ్రత్తగా కడిగి శుభ్రం చేస్తోంది.

"నాకు తెలిసిన వాడొకడు విషం పెట్టమని నాతో చెప్పాడు." కుక్కల హంతకుడన్నాడు.




"విషమా ?"

"అవును. నేను చస్తే దాన్ని వాడను.నేను నీడలో హాయిగా కూర్చుని టీ తాగుతుంటె విషంతో బాధపడుతూ కుక్కచావాలని నా ఉద్దేశ్యం కాదు. నేను కుక్కల్ని ఎన్నాళ్ళు చంపినా సరే నేను నా బడితెతో దానిని ముఖాముఖీ ఎదుర్కొనకపోతే అది నిజమైన పని అని పించుకోదు. నా చిన్నప్పట్నుంచీ ఈ బడితెతోనే కుక్కల్ని హతమారుస్తున్నాను. విషం ఇవ్వటంవంటి అతి నీచమైన పనికి నేను దిగజారలేను!"

"అవును పాపం" అన్నాను నేను.

"అంతే కాదు నీవు విషాన్ని వాడావే అనుకో అప్పుడు కుక్కలనుంచి మహా చండాలమైన కంపు కొడుతుంది. నీకు తెలుసోలేదోగాని అక్కడ పొగలు చిమ్ముతూ పడివుండే కుక్కలకి కూడా తోలు వొలిపించుకున్నప్పుడు చక్కగా మంచి వాసన వేసే హక్కు వుండాలి."

నేను నవ్వాను.

"తప్పకుండా. వాటికా హక్కు వుంది" అన్నాడు కుక్కల కిల్లర్ సీరియస్‌గా. "నేను వాటికి విషం పెట్టే రకం కాదు. నాకు కుక్కలంటే ఇష్టం"

అమ్మాయి కడగవలసిన తోళ్ళని తీసుకొని బయటకు వచ్చింది. మోటుగా అనారోగ్యంగా వున్న ఆమె ఒళ్ళు పాలిపోయింది. ఆమె మొహంలో వుప్పొంగే ఉత్సాహం కనిపిస్తోంది. రక్తసిక్తమైన చర్మాలు...వాటికి మందమైన కొవ్వు అంటిపెట్టుకుని వుండి.. బరువుగా... మోయటానికి వీలుకాని విధంగా ఓ తడిసిన ఓవర్ కోట్‌లా బరువుగా వున్నాయి. కడిగే స్థలానికి తీసుకెళ్ళటంలో నేను ఆమెకు సాయం చేశాను.

"ఆమనిషికి" తోళ్ళని మోస్తూ ఆమె అన్నది "అతడి సంప్రదాయాలమీద నమ్మకం వుంది. బడితెతోనే కుక్కల్ని చంపటంలోని గర్వించదగిన విధానం....అదే అతడి జీవితానికి అర్థం పరమార్థం "

"అది అతడి కల్చర్"

"కుక్కల్ని చంపేవాడికి కల్చర్ ! " ఏ ఎమోషన్ లేని కంఠంతో ఆమె జవాబిచ్చింది. "వాటికీ అతడికీ ఏమాత్రం తేడా లేదు."

"హు ? వేటి మధ్య"

"మనుషులు పొట్ట పోసుకొనే విధానాల్లోని సంస్కృతి అవగాహన గురించి నేను చెబుతున్నాను" ఆమె విడమర్చి చెప్పింది "సాంఘిక శాస్త్రాల్లో విమర్శకులు ఎలా రాస్తారో నీకు తెలుసుకదా ! అది నిజమైన కల్చర్. దైనందిన జీవితంతో ముడిపడి వుంటుంది. అది అందరికీ తెలిసిందే . కానీ నీకు తెలుసా ! కొన్ని విషయాలని పరిశీలిస్తే అవి సింపుల్ కాదని తెలుస్తుంది. కుక్కల్ని చంపేవాడి కల్చర్,, ప్రాసిట్యూట్ కల్చర్, ఎగ్జిక్యూటివ్ కల్చర్, అవన్నీ లోతుగా పాతుకుపోయి భయం వేసేలా అసహ్యంగా వుంటాయి. కాని వాటిలో లవలేశమైన తేడా వుండదు."

"నీకు ఇవన్నీ చూసి నిరాశగా వుందా?

"నాకేమీ నిరాశ లేదు" అని సమాధాన మిచ్చింది అక్కసు నిండిన కళ్లతో నాకు ఎదురుచూపు నిస్తూ" నేనిక్కడ కుక్కల తోళ్లని కడుగుతున్నాను కదూ? నా బెరి బెర జబ్బు కోసం నేను క్రొత్త మందు తీసుకుంటున్నాను'

"అయితే ఇలాంటి అసహ్యమైన సంస్కృతులలోకి మనంకూడా మొదటి అడుగులు వేయబోతున్నామా? "

"మనం వేసే మన మొదటి అడుగులు గానీ ఇంకా ఏమి టేమిటో ఇతర విషయాలు మాట్లాడటం లేదు నేను. నేనంటున్నదల్లా అందరమూ ఇప్పటికే మన పీకలదాకా మునిగిపోయి ఉన్నాం. ఎవరికి వారే వాళ్ళ సాంప్రదాయ పద్ధతుల బురదలో దిగబడి పోయారు. దానిని అంత తేలికగా కడగటం సాధ్యం కాదు."

శుభ్రం చేసే ప్రదేశంలో ఉన్న కాంక్రీటు మీద మేము తోళ్ళని విసిరేశాం. నా చేతులు

భరించలేనంత అసహ్యంగా వాసన వేశాయి.

"చూడు' ఆమె నిలబడి ఒంగి వేలికొనతో వాచిన కాలిపిక్కని పొడిచి చూపింది. ఓ నల్లటి లొత్తగా మారి మెల్లగా పాక్షికంగా మళ్ళీ మామూలు షేపుకి వచ్చింది.

"ఇది చాలా భయంకరంగా ఉంది కదూ? ఎప్పుడూ ఇలాగే ఉంటుంది."

"అవునవును, చాలా టెరిబుల్" చూపు తిప్పేస్తూ అన్నాను.

ఆమె తోళ్ళని శుభ్రం చేస్తుంటేనేను ఓ కాంక్రీట్ బల్ల మీద కూర్చున్నాను. దూరాన నర్సులు గడ్డిమీద టెన్నిస్ ఆడుతున్నారు. వాళ్ళు బాల్‌ని కొట్టినపప్పుడు 'మిన్' అయినపప్పుడు పొట్ట చెక్కలయేలా నవ్వుతున్నారు.

"నాకు జీతం రాగానే" అంది అమ్మాయి "నేను వెళ్ళి ఓ అగ్నిపర్వతాన్ని చూస్తాను. నేను కూడబెట్టిన డబ్బు కాస్త ఉంది నా దగ్గర

"అగ్ని పర్వతాన్ని చూస్తావా?" అన్నాను నిరాసక్తంగా

"అగ్ని పర్వతాలు నిజంగా భలేనవ్వొచ్చేలా ఉంటాయి"' ఆమె మెత్తగా నవ్వింది. ఆమె కళ్ళు అలసి పోయి నట్లుగా కనిపించాయి. ఆమె ఆకాశంకేసి చూస్తోంది... ఆమె చేతులు నీళ్ళలో నానుతున్నాయి.

"నీవు అంత ఎక్కువ నవ్వవు కదూ?" అన్నాను నేను.

"నీ వన్నది నిజమే. నాలాంటి వాళ్ళు ఎక్కువగా నవ్వరు. నేను చిన్న పిల్లగా ఉన్నప్పుడు కూడా అంతగా నవ్వే దానిని కాదు. ఒకోసారి నాకనిపిస్తుంది. నేను నవ్వటం అసలు మరిచి పోయానేమోనని, కాని నేను అగ్నిపర్వతంగురించి ఆలోచిస్తాను. అప్పుడు కళ్ళలో నీళ్ళు తిరిగే వరకూ నేను నవ్వుతాను. ఓ పెద్ద పర్వతం... సరిగా దానికి మధ్యలో రంధ్రం ఉండటం కన్నా... దానిలో నుంచి పొగ సుడులు తిరుగుతూ రావడం కన్నా ఏది ఫన్నీగా ఉంటుంది?"

నవ్వుతో ఆమె భుజాలు అదిరాయి.

"జీతం డబ్బు చేతికి రాగానే వెళతావా?'

'యస్. వెంటనే వెళతాను. నేను ఆ కొండనిఎక్కువతున్నప్పుడు వచ్చే నవ్వులో చచ్చి పోతానేమో నని పిస్తుంది.

టేబుల్ మీద అలా జారగిలబడి నేను ఆకాశంకేసి కళ్లార్పకుండా చూశాను. చేపల్లాగా మేఘాలు మెరుస్తున్నాయి. సూర్యుడు మిరుమిట్లు గొలుపుతూ ప్రకాశిస్తున్నాడు. సూర్యకిరణాలు కంట్లో పడకుండా అడ్డుపెట్టిన నా చేయి రక్తపు వాసన వేసింది. నా శరీరంలో ప్రతి అణువు లోనికీ శునకాల వాసన ఇంకి పోయి నట్లుగా ఉంది. ఇరవై కుక్కల్ని చంపడంలో సాయపడిన చేతికీ వాటిని తలల మీద మృదువుగా తాకిన చేతికీ ఏదో తేడా ఉంది.

"నేను నా కోసం ఓ కుక్క పిల్లని కొనుక్కుంటాను. నేను ఆమెతో చెప్పాను.

"ఏమిటి?"

"నేను నిజంగానే అతి దీనంగా ఉన్న ఓ బుల్లి కంత్రీ కుక్క పిల్లని .... ఎర్ర బొచ్చు ఉన్న దాన్ని కొంటాను. ఆ కుక్క... ఎలా చెప్పమంటావు. ఏమీ చెయ్యకుండానే నూట ఏభై కుక్కలతో విరోధం కోరి తెచ్చుకుంటుంది. అప్పుడు దాని ముఖం వక్రబుద్ధితో వికృతంగా మారి పోతుంది".

నేను చిరునవ్వు నవ్వాను. ఆ అమ్మాయి తన పెదవులని బలవంతంగా ఓ సన్నని గీతలా నొక్కి పట్టింది.

"మనం నిజానికి చాలా జుగుప్సాకరమైన వాళ్లం" అంది అమ్మాయి.

మేమిద్దరం కలిసి స్టోర్ రూము ముందున్న స్థలానికి తిరిగి వచ్చాము.

కుక్కల హంతకుడూ హాస్పటల్ సిబ్బందిలో ఎవడో కలిసి మాట్లాడు కుంటున్నారు. దగ్గర్లో నిలబడి ప్రైవేట్ కాలేజి విద్యార్థి చాలా ఆసక్తితో వింటున్నాడు.

"నేను మొదటినుంచీ నీకు చెబుతూనే ఉన్నాను."

హాస్పటల్‌లో పనిచేసేవాడు అంటున్నాడు.

"కుక్కల తిండి కోసం హాస్పటల్ వాళ్ళు డబ్బు కేటాయించలేదు. ఆ కుక్కలకి నాకూ ఏమీ సంబంధం లేదు. పైగా వాటిని కాపలా కాసేవాడిని ఇవ్వాళనుంచీ మరోపనికి వేశారు.

"వీటన్నింటినీ వదిలించుకునే పనిని మేము ఇవ్వాళ పూర్తి చేయలేమేమో"

"కుక్కలకి పెట్టే తిండి వగైరా ఇవాళతో ఆగిపోతుంది."

"అయితే వాటిని తిండి పెట్టకుండా మాడుస్తారన్న మాట?" అన్నాడు కుక్కల్ని చంపేవాడు తన చెవులని తానే నమ్మలేనట్లుగా.

"హాస్పిటల్‌లో మిగిలినవీ పేషెంట్స్ తినగా వదిలేసినవీ మేము ఇస్తుండే వాళ్ళం. కాపలా కాసే వాడే వుంటే వాటికి ఆకలి లేకుండా చూడవచ్చు"

"వాటికి తిండి నేను పెడతాను" అన్నాడు కుక్కల్ని చంపేవాడు" ఆ వదిలేసిన తిండేదో నాకే ఇస్తే.. ఇస్తారు కదూ?

"తప్పకుండా వాటిని ఎక్కడ పెడతామో ఓసారి చూస్తావా"? "అవును నేను ఒక సారి చూడటం మంచిది. తర్వాత నేను కుక్కలకి తిండి పెడతాను"

"నేను సాయం చేస్తాను" అంది అమ్మాయి" "ఆవండి?" అన్నాడు ప్రైవేట్ కాలేజి స్టూడెంట్ పట్టరాని ఉద్రేకంతో

కుక్కల హంతకుడు హాస్పిటల్ పనిచేసేవాడు కలిసి స్టోర్ రూమ్‌ల వెనకవున్న చీకటిదారి వేపుకి వెళ్ళారు.

"చూశావా వాడిక్రూరత్వం గురించి ఎలా మాట్లాడుతున్నాడో! వాడు కుక్కలని చంపే విధానం ఎంతో హేయమైనది".

అమ్మాయి ఇదేమీ పట్టనట్లు నేలకేసి చూస్తూ ఏమీ మాట్లాడకుండా కూర్చుంది. నా ఆకుపచ్చ పాంట్ మీద రక్తపు మరక చిక్కగా మెరిసింది. అది ఓ ఒంటె తలలా వుంది.

"ఏమంటావు? ఆ విధానం నీచమయిందని నీవు అనుకుంటావా?"

"బహుశా అంతేననుకుంటాను" ఏమాత్రం ఆసక్తి లేకుండా అన్నాను.

ప్రైవేట్ కాలేజి స్టూడెంట్ నేలమీద కూర్చొని కళ్ళునేలకి వాల్చి ఉత్సాహం ఏమీ లేని కంఠస్వరంతో మాట్లాడాడు.

"ఆ పిట్టగోడ వెనక నిశ్శబ్దంగా ఆ కుక్కలు కూర్చుని వుండటం నేను భరించలేను. ఆ గోడ వెనక ఏం జరుగుతోందో మనం చూడగలం. పాపం ఆ కుక్కలేమో చావుకి సిద్ధమై ఎదురుచూస్తున్నాయి."

"అవి గోడవెనక ఏమిజరుగుతోందో చూడకుండా వుండటమే మేలు" అంది అమ్మాయి.

"నీవు చెప్పింది నిజమే ఆ నిస్పృహని నేను భరించలేను. ఆ కుక్కలు అతి దీనమైన పరిస్థితిలో తోకలూపుకుంటూ తిండి తింటుంటాయి"

అతడికి ఎలా సర్ది చెప్పాలో మాకు తోచలేదు. చేతిలోని గొలుసు తిప్పుతూ మరోకుక్కని బయటికి తీసుకురావటానికి నేను లోపలికెళ్ళాను. అప్పుడు నాలో నేననుకున్నాను. అన్నింటిలోకీ పెద్దదైన ఓ కుక్కని...చెవులు వేళ్ళాడుతున్నదానిని తీసుకెళదామని.

అప్పటికి చీకటి పడుతోంది. దాదాపు ఏభై కుక్కల వరకూ వదిలించుకున్నాము. మేము కాళ్ళూ, చేతులూ, కడుక్కోవటానికి కుళాయి దగ్గరకెళ్ళాము. కుక్కల్ని చంపేవాడు తడిపి ఆరేసిన తోళ్లని చక్కగా వరసల్లో పేర్చి తాటితో కట్టలు కట్టుకున్నాడు. కుక్కల విషయం చూసు కోవటానికి హాస్పిటల్ వాళ్ళు నియమించిన కంట్రాక్టరు కూడా వచ్చాడు. మేమందరం కాళ్ళు చేతులు కడుకున్నాం

శుభ్రంచేసుకున్నాక కుక్కల్ని చంపేవాడు పనిచేసుకుంటుంటే చూస్తూ నిలబడ్డాము.

"కళేబరాల్ని ఏంచేస్తారు'? ప్రైవేట్ కాలేజి స్టూడెంట్ అడిగాడు.

''అదిగో అటు చూడు. వాటిని కాల్చేస్తున్నారు'' హాస్పటల్ మనిషి అన్నాడు.

క్రిమటోరియం లోంచి వస్తున్న మందమైన పొగ స్తంభం కేసి మేము తలెత్తి చూశాము. దానిలో నుండి లేత ఎరుపురంగు పొగ దట్టంగా వస్తూ ఆకాశం వేపుకి పోతోంది.

''కాని అది మనుషుల శవాలని కాల్చటానికి కాదా?'' స్టూడెంట్ అడిగాడు.

కుక్కల్ని చంపేవాడు అతడికేసి తిరిగి తీక్షణంగా ఓచూపు విసిరాడు.

"ఏమిటి నీ ఉద్దేశం? మనిషి శవాలకీ కుక్కలకీ ఏమిటి తేడా?"

ప్రైవేట్ కాలేజి స్టూడెంట్ తనచూపు నేలకు వాల్చి ఏమీ అననప్పటికీ అతడి భుజాలు మృదువుగా వణకటాన్ని నేను గమనించాను.

"అతడికి బాగా కోపం వచ్చినట్టుంది" అన్నాను.

"నిజంగానే తేడా వుంది. కాని చాలా స్వల్పం" పొగ గొట్టం వేపు చూస్తూ అమ్మాయి అంది.

ఎవరూ జవాబివ్వలేదు. కాస్త ఆలస్యంగా నేను అడిగాను.

"ఏమిటది?"

"ఆ పొగరంగు వేరు. అది కాస్తలేతగా వుంటుంది. మనుషుల్ని కాలుస్తున్నప్పుడు కొద్ది పిసరు ఎర్రరంగు కనిపిస్తోంది.

"బహుశా" నేను హాస్యంగా అందించాను 'వాళ్లు ఓ పెద్ద ఎర్రటి ముఖం వున్న వాణ్ణి తగలబెడుతున్నారేమో?"

"లేదు అవి కుక్కలే అయివుండాలి" అంది అమ్మాయి. కాని ఆ ఎర్రరంగు సూర్యాస్తమయ సమయం వలన కూడా అయివుండొచ్చు".

మేమందరం ఏమీ మాట్లాడకుండా పొగవేపుకి చూశాము. కుక్కల్ని చంపేవాడుతోళ్ళ మూటని లేపి భుజం మీద పెట్టుకున్నాడు. ఎర్రబడుతున్న ఆకాశపు నేపథ్యంలో అతడు నల్లగా బలిష్టంగా కనిపించాడు.

"రేపు మనమందరం రోజంతా బాగా పనిచేస్తాం లావుంది" అన్నాడు కుక్కల్ని చంపేవాడు తృప్తిగా" ఏమంటారు? నేను చెబుతున్నాను కదా రేపు మంచిరోజు అవుతుందని"




మరునటి రోజు నిర్మలంగా ఉదయించింది అందమైన రోజు . కుక్కల్ని వదిలించుకోవటానికి నియమించిన కంట్రాక్టర్ రాలేదు.

కాని పనిమాత్రం చాలా సులభంగా ఏ అడ్డంకులు లేకుండా సాగిపోయింది. మధ్యాహ్నానికల్లా మేము ఆరోజు కోటాలో మూడు వంతులు పని పూర్తి చేశాము. అలసిపోయినా మేమందరం చెప్పుకోదగినట్లుగా హుషారుగా వున్నాము ప్రైవేట్ కాలేజి విద్యార్థి మాత్రం కాస్త చిరాకుగా అన్యమనస్కంగా వున్నాడు. అతడు తన పాంట్ మీద పడిన నెత్తురు మరకలు గురించి, రాత్రి ఎంతో సేపు వేణ్ణీళ్ళ స్నానం చేసినప్పటికీ ఆ కుక్కలకంపు పోలేదని వాపోయాడు.

"నా గోళ్ళ కింద నుండి ఈ కుక్కరక్తం పోవటం లేదు, అది గడ్డకట్టుకుపోయింది. నేనెంతో శ్రమతో సబ్బుపెట్టి నా వళ్లంతా కడిగినా వాసన మాత్రం నన్ను వదలటం లేదు".

"ఈ ఉద్యోగానికి వొప్పుకోవటంలో నీవు పెద్దతప్పుచేశావు కదూ?'' అమ్మాయి అడిగింది.

''అదేమీ కాదు'' అన్నాడతను చిరుకోపంతో "ఈ జాబ్ నేను తీసుకోకపోతే నా బదులు చేసేవాడికీ కుక్క రక్తం ఎండిపోయి గోళ్ళలో ఇరుక్కుని వుంటుంది. అతడి శరీరం కూడా వెధవ వాసనతో కంపు కొడుతుంది. అదే నాకు మింగుడుపడని విషయం."

"నీవు ఓ మానవతా వాదివి" అంది అమ్మాయి. ఆమె కంఠంలో కాస్త విసుగు.

స్టూడెంట్ తన నెత్తురు చిమ్మిన కళ్ళని నేలవాల్చి ఏమీ అనలేదు.

క్రమేణాఅతడు ఇంకా విసుగుతో కుక్కలు చంపేవాడు ఏదో అడిగితే సరిగా సమాధానం చెప్పలేదు. దానితో వాడికి చిర్రెత్తుకొచ్చింది.

ఓ కంత్రీ కుక్కని నేను గొలుసుతో బయటకు తీసుకువెళ్ళినప్పుడు కుక్కల్ని చంపేవాడు సిగరెట్ కాల్చటానికి దొడ్లోంచి బయటకి వచ్చాడు. ప్రైవేట్ కాలేజి స్టూడెంట్ కాస్త దూరంగా నిలబడి చూస్తున్నాడు అతడి వీపుని పట్టుదలగా కుక్కల్ని చంపేవాడి వేపు తిప్పేసి.

ఆ కుక్కని వ్యాహ్యాళిక తీసికెళుతున్న వాడిలానేను కుక్కల హంతకుడి దగ్గరకి వెళ్ళాను.

"దాన్ని అక్కడ కట్టెయ్యి" అన్నాడతడు .

దొడ్డి గుమ్మానికి దగ్గర్లోవున్న గుంజకి దాన్ని నేను కట్టేశాను.

"ఈ కుక్కలన్నీ సాధు జంతువులు" అన్నాడు కుక్కలని చంపేవాడు బోర్‌గా వున్నట్టు ముఖం పెట్టి." ఈ సాధువుల్లో కూడా ఏదోఓ కుక్క వుంటుంది దూడ అంత ఎత్తువుండి...కాట్ల కుక్కలా మీద పడేది. అలాంటి కుక్క వస్తే కాస్త ఇబ్బందే" నేను వొచ్చే ఆవలింతని ఆపుకుంటూ" అ అదుపు తప్పి ప్రవర్తిస్తే "అన్నాను.

"అలాంటి కుక్కలకోసం" కళ్ళలో నీళ్ళు తిరుగుతుండగా ఆవలింతని ఆపుకుంటూ సమాధానమిచ్చాడు" వాటిని అదుపులో పెట్టటానికి ఓ మార్గం వుంది"

అంటూ కుక్కల్ని చంపేవాడు మిణుకుల మీద దట్టంగా పెరిగిన బొచ్చున్న చేతిని లూజుగా వున్న తోలు బెల్ట్‌పైన బోడ్లోకి దోపాడు.

"ఆపండి" ప్రైవేట్ కాలేజి విద్యార్థి అరిచాడు". అటువంటి జుగుప్సాకరమైన సంభాషణ వినాల్సిన అవసరం నాకు లేదు'

' "ఇదిగో చూడు నేను ఇతనికి ఎత్తున్న కుక్కల్ని ఎలా అదుపులో పెట్టాలో వివరంగ చెబుతున్నాను"

స్టూడెంట్ పెదవులు వణుకుతున్నాయి.

"నేను నీకు చెబుతున్న దేమిటంటే నీ పద్ధతులు పరమ నీచమైనవి. .. అ ఘోరమైనవి. ఎంత కుక్కలకైనా కొంచెం ఆదరణకి అర్హత వుంటుంది".

"ఇదంతా నాకు నువ్వు చెబుతున్నావా? ఓ చిన్న కుక్క పిల్లని కూడా చంపలేవని నేను

వందెం వేస్తాను''.అన్నాడు. కుక్కల్ని చంపేవాడు. ఉమ్మి తుంపరలు అతడి పెదవి మీదకి చిమ్మాయి. అతడు కొంత పాలిపోయినట్లుగా కనిపించాడు.

పై దవుల్ని గట్టిగా అదిమిపెట్టి స్టూడెంట్ కుక్కల్ని చంపేవాడిని కోపంగా చూశాడు. హఠాత్తుగా, అతడు కుక్కల్ని చంపే బడితెని తీసుకుని దొడ్డిలో గుంజకి కట్టేసి వున్న కుక్క కేసి పరుగెత్తుకెళ్ళాడు. స్టూడెంట్‌ని చూసి ఆ కుక్క భీకరంగా మొరిగింది తన తలమీద వూపుతున్న బడితెని చూస్తూ, అతడు కాసేపు సంశయించి కాస్త ముందుకెళ్ళి మీదకి ఎగురుతున్న కుక్కని నెత్తిమీద చెవికి కాస్త దగ్గరగా ఓ దెబ్బవేశాడు. జంతువు ఎగిరి అవతల పడింది. అది వెళ్ళి గోడకి తగిలినప్పుడు కుయ్యో మొర్రో మంటూ అరుస్తున్నది కాని అది చావలేదు. చావు బ్రతుకులతో నెత్తురు కక్కుకుంటూ ఆ కుక్క నేల మీద పాకుతోంది. స్టూడెంట్ స్థాణువులా ఆయాసపడుతూ దాని వంకకి చూస్తూ నిలిచి పోయాడు.

"కమాన్ ... చంపెయ్ దాన్ని ..." అంటూ కుక్కల్ని చంపేవాడు కేకలేశాడు. అతడి కంఠంలో ఆవేశం నిండి పోయింది. "దాన్ని బాధ పడనియ్యకు".

స్టూడెంట్ మాత్రం కదల్లేదు. నోరు తెరుచుకుని, రొప్పుతూ, కొంచెం వణుకుతూ అతడలా నిలుచుండిపోయాడు. కుక్క విలవిలలాడుతూ గొలుసు"ని లాగుతూ వెనుక కాళ్ళతో ఈడ్చుకుంటున్నధి. నేను పరుగెత్తుకెళ్ళి స్టూడెంట్ చేతిలో నుండి బడితెని లాక్కుని కుక్క తలమీద గట్టిగా మోదాను ... దాని సాదు నేత్రాలలో అది నన్ను చూస్తూండగా ... నెత్తురు కక్కుకుంటూ .... ఓ పక్షిలా చిన్న శబ్దం చేసి చచ్చిపడింది.

"అది చాలా దారుణమైన పని" అన్నాడు. స్టూడెంట్.

"ఏమిటి?"

"నీవు పిరికి పందవి. ఆ కుక్క ఏమాత్రం ప్రతి ఘటించలేదు. దాని శక్తి పూర్తిగా నశించిపోయింది.

కోపంతో నాకు మాటలు రాలేదు. అటు తిరిగి కుక్క మెడనుండి గొలుసుని తీశాను. నా తోటి విద్యార్థి మీద నాకు పూర్తిగా ఆసక్తి పోయింది.

కుక్కల్ని చంపేవాడు నాదగ్గర కొచ్చాడు.

"నీవు ఈ పనికి సరైన వాడివి. అలా వుండకపోతే కుక్కల్ని చంపటం చాలా ప్రమాదకరమైన వృత్తి"

నేను సరైన వాడిని కాదని మధ్యాహ్నానికి తేలిపోయింది. ఎండి పోయిన ఓ బ్రౌన్ రంగు కుక్క, మధ్యరకపు సైజుది నా తొడ మీద కరిచింది.




దానిని నేను బయుటకు తీసుకెళుతున్నప్పుడు దొడ్డి ముఖద్వారం దగ్గర రక్తసిక్తమైన తోళ్ళని తీసుకుని అమ్మాయి నాకెదురు వచ్చింది. దానిని చూసిన కుక్క కలవర పాటు చెందింది. అదుపు తప్పనీయకుండా నేను గొలుసులాగాను కాని కుక్క చెంగున ఎగిరి నా తొడలో దాని పళ్ళు దిగేలా కరిచింది. కుక్కల్ని చంపేవాడు దొడ్డిలోనుండి వచ్చి త్వరగా కుక్కని నా మీద నుండి లాగివేశాడు. నా తొడమాత్రం పక్షవాతం వచ్చినట్లుగా మొద్దుబారిపోతోంది.

"నీవు చాలా భయంకరమైన పెద్దకేక వేశావు కదూ?" అన్నది అమ్మాయి." ఎంత కుక్క కరిచినా అంతలా అరవాలా?'

నెత్తురుతో నా మేజోళ్ళు తడిసిపోయాయి. కుక్కల్ని చంపేవాడు చచ్చిన కుక్కనోరు విడదీసి లోపలికి చూశాడు.

" ఈ కుక్క చాలా భయంకరమైన పళ్ళతో బాగా కరిచింది కదూ? కుక్క బాగా బలహీనంగా వుంది పైగా దాని పళ్ళు బాగా పుచ్చిపోయి కదిలిపోయీ వున్నాయి. చూడు చూడు అవి ఎంత మురికిగా వున్నాయో?"

నాకు చాలా రక్తం పోయినట్టుగా నాకు తోచింది. ఆ పిల్ల ఏదో బలవంతంగా నన్ను సమర్థిస్తున్నప్పటికీ ఆ ప్రైవేట్ స్టూడెంట్‌గాడు నన్ను చూడటానికి నేను ఇష్టపడలేదు.

నేను తొలుపరిచిన సోఫా మీద వాలిపోయి వున్నాను. నగ్నంగా వున్న నా తొడమీద నర్స్ జాగ్రత్తగా బాండేజ్ చుడుతోంది.

"నొప్పెడుతోందా?"అడిగిందామె

"అబ్బే అసల్లేదు"

"నేను అలా అనుకోవటం లేదు" అందామె. నా కేసి క్రిందకి చూస్తూ తన కాళ్ళమీదకి లేచి నిలబడుతూ

"నడవటానికి ప్రయత్నం చేయి"

నేను పాంట్ పైకిలాగి ఓ రెండు అడుగులు వేశాను.

"బాండేజీ వల్ల కండరాలు కాస్త టైట్‌గా వున్నాయి"

"అయితే ఫర్వాలేదు. ఇక ఫీజు సంగతా... ఇంజక్షన్ ఇచ్చినప్పుడూ నీకు పూర్తి ఎకౌంటూ, స్టేట్‌మెంట్ బిల్లూ ఇస్తాము"

"ఇంజక్షనా?"

"తప్పకుండా నీకు రాబీస్ రావాలని నీకు కోరిక లేదు కదా లేకపోతే కావాలా?"

నేను నా చేతుల్ని సోఫా మీదకి పెట్టి నా చూపుల్ని నేలకు వాల్చాను. గోళ్ళ దగ్గర చర్మం పగిలివున్న నా చేతులు వణికాయి.

"రాబీస్?"

"అవును"

"రాబీస్ ఇంజక్షన్లంటే అంత సులభం కాదనుకుంటాను కదూ?"

ఆమె కరాఖండిగా చెప్పింది

"నేను చెబుతున్నానుగా విను. ఒకోసారి నీవు బ్రతుకుతావో చస్తావో అది నిర్ణయిస్తుంది'

' నేను బాధతో మూలిగాను.

"ఎందుకనో నాకు మానసికంగా ఎంతో బాధగా వుంది"

"ఇంతకీ నీవు ఏమని ఆలోచిస్తున్నావు?'

" ఆ కుక్క పళ్ళ గురించి" అన్నాను నేను కోపంగా

"ఇదిగో ఎవరక్కడ?" ఎవరో అరిచారు' ' హే! ఏయ్! లోపల ఎవరయ్యా అరే మాట్లాడరేం?"

నేను తలుపు తెరిచి వెనకవున్న మెట్లు దిగి క్రిందకి వెళ్ళాను. కుక్కల్ని చంపేవాడు, ఇంకా ఇతరులూ స్టోర్ రూముల ముందు గుంపుగా నిలబడి వున్నారు. వాళ్ళ మధ్యలో ఓ పోలీస్ వున్నాడు. అతడు ఇటు తిరిగి నా కేసి ఎగాదిగా చూస్తున్నారు. నేను కుంటు కుంటూ నడుస్తూ వాళ్ళని సమీపించాను. పోలీస్ నా పేరూ అడ్రసూ తన నోట్‌బుక్‌లో రాసుకున్నాడు.

"ఏమిటి సంగతి"? అడిగాను నేను

అతడు నా ప్రశ్నని పట్టించుకోలేదు

"ఏమయింది?"

"మనకి ఉద్యోగాలిచ్చినవాడు హోల్‌సేలుగా మాంసం అమ్మే వ్యాపారి అట." స్టూడెంట్ అమ్మాయి చెప్పింది. "అతడు నేననుకుంటున్నట్లుగా ఆ కుక్కల్ని కసాయివాడికి అమ్ముతున్నాడట కసాయి వాడు వెళ్ళి పోలీసులకి రిపోర్టిచ్చాడు. అసలు వాడు పారిపోయినట్లున్నాడు".

ఏమీ అనకుండా ఆమె వేపు చూశాను

"అయితే మనకెవరికీ జీతాలు రావన్నమాట?"

నేను మళ్ళీ బాధతో మూలిగాను.

"వాడు పారిపోవటంతో మనకెవ్వరికీ దమ్మిడీ రాదు. అది మాత్రం ఖాయం"

నేను కుక్కల్ని చంపేవాడికీ, మగ స్టూడెంట్‌కేసీ చూశాను. వాళ్ళిద్దరి ముఖాల్లోనూ వర్ణనాతీతమైన విచిత్రమైన భావాలున్నాయి.

"మరి హాస్పిటల్‌లో నాకు కావలసిన ట్రీట్‌మెంట్‌కీ మందులకీ అయే ఖర్చు సంగతేమిటి?

"కుక్క కరిచింది కంట్రాక్ట్ తీసుకున్నవాణ్ణీ, కసాయివాణ్ణీ కాదు గదా?" అందామె

"మాకు కాస్త ఇతర ఆచూకి ఇవ్వటానికి మీరు స్టేషన్‌కి రావాలి" అన్నాడు పోలీస్ గట్టిగా.

"మమ్మల్ని మీరు కావలసినప్పుడు పిలిపించవచ్చు" మగ విద్యార్థి పొటెస్ట్ చేశాడు "కుక్క మాంసం అమ్మించి మేం కదూ? మేము అమ్ముతున్నది"

"కారణం లేకుండా కుక్కల్ని చంపటం కూడా అంతతేలికగా తీసుకోవలసిన విషయం కాదనుకుంటాను"

"అయితే మేము ఆ పని ఆనందంతో చేశామని మీ ఉద్దేశమా?"

పోలీస్ స్టూడెంట్ అన్న చివరి మాటల్ని పట్టించుకోకుండా కాంపౌండ్‌లో అడ్డంగా నడిచి వెళ్ళిపోయాడు.

ఎవరూ ఏమీ అనలేదు. కరిచిన చోట మెల్లగా వదలకుండా సలపరించటాన్ని నేను ఫీలయాను. అక్కడ బాగా వాచి పోయింది.

"మనం ఎన్ని కుక్కల్ని చంపి వుంటామంటావు?" అంది అమ్మాయి

"డెబ్బై""

"అంటే ఇంకా ఎనభై మిగిలిపోయాయన్నమాట?"

"ఇప్పుడు మనం ఏం చేద్దాం?" అన్నాడు ప్రైవేట్ కాలేజి స్టూడెంట్

"నేను వెళ్ళిపోతాను" విచారంగా అన్నాడు కుక్కల్ని చంపేవాడు. తన సామాను తెచ్చుకోవటానికి దొడ్డిలోకి వెళ్ళాడు అతడు.

పేవ్‌మెంట్‌కి దగ్గర్లో వున్న ఆర్చి దిశగా మేము నడవటం మొదలు పెట్టాము.

"ఎట్లావుంది అక్కడ?" ఆ అమ్మాయి. ఆమె వేళ్ళు నా వంటితో రాసుకుంటూ. "నొప్పెడుతుందా?"

"నొప్పిగానే వుంది. అంతేకాదు ఇంజెక్షన్స్ కూడా తీసుకోవాలంటున్నారు."

"అన్యాయం"

"అవును" నేను వొప్పుకున్నాను.

సూర్యాస్తమయం మొదలయింది. ఎక్కడో ఓ ఒంటరి కుక్క మొరుగుతోంది గట్టిగా.

"మనం ఆ కుక్కకి అన్యాయం చేయ బోయాం" నేను అయోమయంగా అన్నాను "మనకే అన్యాయం జరిగింది చివరికి"

అమ్మాయి నవ్వింది. కాని ఆమె నుదురు ముడిపడి వుంది అలసిపోయిన నేను కూడా నవ్వాను.

"కుక్కల్ని కొట్టిచంపి తోళ్ళు తీశాం. మనకీ ఎవరో అన్యాయం చేశారు. అందువల్లనే మనం ఇంకా ఇక్కడ నడుస్తూనే వున్నాం"

"మనమూ మన చర్మాలు పోగొట్టుకున్నామని నీవు అంటావా?" అమ్మాయి అన్నది.

అన్ని కుక్కలూ అరవటం మొదలు పెట్టాయి. వాటి అరుపులు ఓ వదలని సలపరింపులా సంధ్యాసమయపు ఆకాశం వేపు ఎగసిపోయాయి. అవి రెండు గంటల వరకూ వదలకుండా మొరుగుతాయని మీరు రూఢిగా నమ్మవచ్చు.

